ఊర్వశి

"శశి"

"శశి టెలిగ్రాం ఇచ్చింది—"

చేతిలో ఉన్న ఫైలును ప్రక్కన పెట్టి రివాల్వింగ్ చైర్ లోంచి టెలిఫోన్ రిసీవర్ నందుకోబోతున్న నేను నిద్రపోతున్న వానిలా ఒక్కసారి తుళుక్కుపడి స్టెనో లత రూములోకి చూశాను. ఆ గది స్ప్రింగ్ డోర్సును తెరచుకుంటూ గులాబి రంగు కాగితాన్ని గాలిలో ఆడిస్తూ మూర్తి లతతో అంటున్న మాటలవి. తెరచి ఉన్న తలుపుల దారిలో మూర్తి, లత నాకు స్పష్టంగా కనిపిస్తున్నారు. 'శశి' పేరును విన్న నేను రిసీవర్‌ను జారవిడిచాను.

"టెలిగ్రామా ? ఏమని ?" కంగారు పడుతూ అడిగింది లత కుర్చీలోంచి లేచి టెలిగ్రాము నందుకుంటూ.

నిజానికి నాలోకూడ అంత కంగారుంది.

మూర్తి ఆమె భుజంమీద చెయ్యివేసి "కంగారేంలేదు. రాత్రి ఎక్స్‌ప్రెస్ ట్రయిన్‌లో విజయవాడ వెళ్తోందిట. నిన్ను స్టేషన్‌కి రమ్మంది" అన్నాడు టేబిల్ అంచుకి చేరగిలాపడి నిలబడుతూ.

శశి విజయవాడ వెళ్తోందా? విజయవాడలో యింకా ఎవరున్నారు? ఇంతకాలమై విజయవాడ వెళ్ళని శశి యిప్పుడెందుకు విజయవాడ వెళ్తోంది. నాకు తెలియని బంధువులుగాని, స్నేహితులుగాని ఆమెకు ఎవరున్నారు ?— ఆలోచనలో పడ్డాను.

"ఎంతకంగారు పెట్టేశారు! ఛా ! మీరెప్పుడూ యింతే !" అంటోంది లత, అతని ముణుకుల మీద చేతులువేసి కుదుపుతూ గోముగా. అటు తరువాత అతను ఆమెకు కొద్దిగా దగ్గరగ జరగటం, అతను ఆమె కళ్ళలోకి చూడటం, ఆమె కళ్ళతో సన్నగ నవ్వటం నాకు స్పష్టంగా కనిపిస్తున్నది.

వారిద్దర్నీ నేనలా చూడటం నాకేమీ క్రొత్తకాదు.

నేను ఆక్షేపణ చూపను. కారణం ? వారిద్దరూ భార్యాభర్తలు. అతను మా ఆఫీసులో ఎల్.డి.సి. ఆమె; నా స్టెనో. అందుచేత వారిని చూచి చూడనట్టే వదిలేస్తాను. కాని నేను వారిద్దర్నీ చూడటమే వారి ఉద్దేశ్యమని నాకనిపిస్తుంది.

"ఇదిగో బాస్ ! ఇటు చూడండి. మేమెంత అన్యోన్యంగా హాయిగా ఉన్నామో ! మీ రెందుకలా ఉండరు ? వై డోంట్ యూ ట్రై ?" అన్నట్టు ఉంటాయి వారి చర్యలు.

"వెళ్ళాలా ? తప్పనిసరా ?" నాకు కొద్దిగ అడ్డంగా తిరిగి అడుగుతున్నాడతను.

"ఎంత గమ్మత్తుగ అడుగుతున్నారు ? శశి ఎవరో మీకు తెలియదా ? ఆమె నా ప్రాణానికి ప్రాణం. మీరు నాకు తటస్థపడక పోయి ఉంటే నే నామెనే తప్పక పెళ్ళాడి ఉందును. ఆమె నా ఫ్రెండు. క్లాస్‌మేట్, మై డియరెస్టు డియర్. అర్థమైందా సార్!" అసలు శశిని చూచి సంవత్సరం దాటిపోయింది కూడా.

"అర్థమైంది డియర్ ! నేను కూడా ఈ రాత్రి నీతో స్టేషన్‌కు వచ్చి, నిన్ను ఆమెకు చూపించి, నీవు ఆమెతో రైలెక్కి పారిపోకుండ వెనక్కి తెచ్చుకోవాలన్నది కూడా అర్థమైంది."

"అంతేకాదు. నేను కొద్దిగ ఇంటికి ముందుగా వెళ్ళి, వెళ్ళే టప్పుడు దారిలో రెండు మూడు కూరలు మార్కెట్టులో కొనుక్కొని త్వరగా వంటచేసి, కేరియర్ తీసికుని స్టేషన్‌కి వెళ్ళాలి. అందుకని బాస్‌ని పెర్మిషన్ అడగాలి" నాకు వినిపించేటట్టుగా అంటోంది లత. నేను వాచీచూశాను. నాలుగు గంటల దగ్గర అయింది టైము. టేబిల్ మీద ఆమె టైపు చేయవలసిన కాన్ఫిడెన్షియల్ లెటర్సు ఇంకా చాల ఉన్నాయి. అవి మర్నాటి పోస్టుకి అందాలి.

"సార్ !" నెమ్మదిగా అంది లత నా టేబిల్ ముందుకి వస్తూ.

నేను నెమ్మదిగా తల ఎత్తాను.

"ఇంటికి వెళ్ళటానికి పర్మిషన్ కావాలి కదా ?" అన్నాను.

"అవున్సార్! నా ఫ్రెండు. ఈ రాత్రి భువనేశ్వర్‌నుండి విజయవాడకు వెళ్తోంది సార్! నే నామెను చూడాలి. అంచేత..."

"ఆమె మీకు అంత ప్రాణ స్నేహితురాలా ?"

"అవున్సార్! విజయవాడలో నేనూ, శశి ఇంటర్ ఫస్టియర్ కలిసే చదువుకున్నాం. తరువాత మా ఫాదర్‌కి యిక్కడికి ట్రాన్స్‌ఫర్ అయిన కారణంగా యిక్కడ కొచ్చేశాం. తరువాత చాలాకాలంగా కలియటం కాలేదు. క్రిందటి సంవత్సరం కలిసిన తరువాత యిదే మళ్ళా కలియటం."

"ఐ సీ! బహుశా ఆమె తన స్వస్థలానికి వెళ్తూండవచ్చు. వెళ్ళండి. మీ స్నేహితురాలిని కలియండి. ట్రైను రాత్రికి కదా...!"

"అవును సార్ ! కాని కొద్దిగ ముందుగావెళ్ళి ఆమెకు కేరియర్ రెడీచెయ్యాలి. కొద్దిగ మార్కెటింగ్‌ఉంది. అందుకని..."

''ఆల్‌రైట్! మీరు వెళ్ళి మీ టేబిల్‌మీది లెటర్సు, పేపర్సు నా టేబిల్‌కి పంపి, మీరు వెళ్ళండి.''

''నా పని మీరు చేస్తారా సార్! వద్దు సార్. నేను రేపు ఉదయమేవచ్చి టైప్‌చేసి మీరు ఆఫీసుకి వచ్చేసరికి రెడీ చేస్తాను''.

''ఇంకా త్వరగా ఆ పేపర్సు పోష్టు చేయించాలని నా ఉద్దేశ్యం. మీరు వెళ్ళండి. నా మూలకంగా మంచి స్నేహితురాల్ని 'మిస్' అవటం నా కిష్టంలేదు. స్నేహం విలువ నాకు తెలుసు''.

నా ముఖంలోకి చూచిందామె; నా ముఖంలో అయిష్టత ఉన్నదేమో తెలిసికోవటం కోసం. ''వెళ్ళండి'' నే నవ్వుతూ అన్నాను.

''థాంక్సు సార్!'' అంటూ నెమ్మదిగా కదిలిందామె.

'శశీ! ఇన్నినాళ్ళకు నిన్ను నే చూడగలుగుతానన్నమాట' నిట్టూర్చాను.

నెమ్మదిగా ప్రైవేటు రూములోకి కదిలి ఈజీచైర్‌లో అనీజీగా రిక్లైన్ అయ్యాను. పైన ఫేన్ తిరగటంలేదు. ఫేన్ ఆన్ చెయ్యమని రాఘవులికి చెప్పాలనీ నాకు తోచలేదు. సిగరెట్ వెలిగించి ఎదురుగాఉన్న లుకింగ్‌గ్లాస్‌లోకి చూశాను.

నా వెనుకనే నవ్వుతూ నిల్చుంది శశి.

నా సిగరెట్ పొగకు ఉక్కిరి బిక్కిరై కళ్ళల్లో నీళ్ళు తెచ్చుకుని నవ్వింది అలాటి నవ్వుకాదు, నా సిగరెట్ పేకట్‌దాచేసి నన్ను విసిగిస్తూ నవ్వింది అలాటి నవ్వు,...గలగల పారే సెలయేటి నవ్వు; ఉదయపు మంచులో తడిసిన మందారం వికసిస్తూ నవ్విన నవ్వు—మరువరాని నవ్వు.

శశి ఇంకా నవ్వుతూనే ఉంది.

నాకు గుర్తు. అందమైన ఆ కళ్ళు నాకు గుర్తు. ఆ లేత చెక్కిళ్ళు, అందమై కొనదేరిన అమె చుబుకం గుర్తు. ఆ ముక్కులో విరుపులు గుర్తు.

శశి...ఏడాటి శశి.

భువనేశ్వర్‌లో ఉన్నదన్నమాట.

విజయవాడలో తనకు యింకా ఎవరున్నారని వెళుతున్నట్టు. ఎవరూలేని చోటికి తానెందుకు వెళుతున్నట్టు ?

భువనేశ్వర్‌లో ఎవరున్నట్టు ?

పెళ్ళయి భర్తతో అక్కడ ఉంటున్నదేమో.

లతను అడిగి ఉండవలసింది. అడిగితే తానెన్నో విషయాలు చెప్పేది.

శశి నీకు ప్రాణస్నేహితురాలు మాత్రమే. నాకు మాత్రం ప్రాణంలో ప్రాణం—అని చెప్పనా! వద్దు. చెప్పకూడదు. ఎవరికీ చెప్పకూడదు. శశిని నేనెందుకు కావాలని దూరంచేసికున్నానో ఎవరికీ తెలియనవసరం లేదు. నిజానికి తెలియవలసింది శశికే. కాని శశికి ఆ నాటినుండి నిజం తెలియకనే ఉండిపోయింది. ఈ రాత్రి నన్ను చూస్తే ''రఘూ! నీవు మంచిపనే చేసావు'' అని అంటుందా ?

అయితే శశిని చూడటానికి నేను వెళ్తానా ?

'నీ ప్రాణానికి ప్రాణమైన శశి నీ కళ్ళముందునుండి వెళ్ళిపోతూంటే ఎదురుపడి పలుకరించక ఉండగలవా?' అద్దంలో శశి నిలదీసి అడిగింది.

'ఉండలేను. చూడకుండ ఉండలేను. పలుకరించకుండ ఉండలేను. వెళ్తాను. శశినిచూస్తాను. చాలారహస్యంగా చూస్తాను. ఆమెకు కనిపించకనేచూస్తాను. నేనుకనిపిస్తేమరల ఆమెలోఅలజడి కనిపించవచ్చు. అంతేకాదు ఏ శశిని పలుకరించాలని లత వెళ్తోందో ఆ లతముందు శశిని నేను ఏమని పలుకరించనూ? తేలిపోనూ?... అయితే ఎలా? ట్రైన్‌కి వెళ్ళటం మానేయనా?''

''ఎందుకు మానేయటం? శశి ఇక్కడ కాకపోతే ఇంకో స్టేషనులో కలయకూడదా? మాటాడకూడదా?'' అద్దం సలహాయిచ్చింది.

''అవును. శశిని రహస్యంగానే చూస్తాను. లత చూడకుండ ట్రైన్ ఎక్కుతాను. శశితో మాటాడుతూ కొంతదూరం వెళ్తాను. ఎంతదూరం? తుని వరకూ వెళ్తాను. తిరిగి ఆఫీసు వేళకు తిరిగి రాలేనూ?''— నా నిర్ణయం నాకే నచ్చింది.

''అవును. అలాగే చేస్తాను. శశి ఎదుటపడే పలుకరిస్తాను. శశికి ఎదురుపడక దాగుండి పోవటానికి నేనేం తప్పుచేశాను? శశితో మాటాడతాను. అందువలన నాపై ఆమెకున్న అభిప్రాయాలు సరిచేసికోవటానికైనా అవకాశం ఏర్పడుతుంది. నా గుండె తేలికవుతుంది''— రఘురాం ఆగాడు. ''ఏం ?'' అన్నట్టు అతనివైపు చూశాను. ''ఒక్క సిగరెట్ దమ్ములాగనీయండి గురువుగారూ!'' ఆ నాటి గుండెబరువు ఈనాడు కూడ తేరలేదు'' అన్నాడు చదువుతున్న కాగితాలను ప్రక్కకు పెట్టి.

నేనూ సిగరెట్ అందుకుని, పాకెట్ అతని ముందుకు జరిపాను. సిగరెట్ ముట్టించుకుంటూ కిటికీ తెర ప్రక్క నుంచి గదిలోపలికి చూశాను, ఎందుకో ముందు గదిలోకి వచ్చిన మా శ్రీమతి వైపు. నా చూపులు అర్థం చేసికొని విసుగ్గా ముఖం పెట్టి లోపలికి వెళ్ళింది. ప్రారంభించనున్న రఘురామ్‌ను ఆగమన్నాను. ఇంట్లోకి వెళ్ళినంత త్వరగా కాఫీ ట్రేలో కప్పుల్లో తెచ్చి మా ముందు పెట్టి వెళ్ళిపోయింది మా శ్రీమతి.

మవునంగా కాఫీ త్రాగాడు రఘురాం.

''ఇప్పుడు చెప్పు'' అన్నాను కుర్చీలో నెమ్మదిగా రిక్లైన్ అవుతూ. రఘురాం ప్రారంభించాడు.

తన భర్తతో నా గురించి ఏమని చెప్తుంది మా అన్నయ్య అంటుందా ? అనదు. ఇంటిలోని వారందరూ నన్ను అన్నయ్యగారని అంటే తను మాత్రం అలా అనేది కాదు

అతనొచ్చారు... అతను బజారులో కనిపించారు...అతను ... అతను... ఇలానే అనేది.

మరి నన్ను 'మా ఫామిలీ ఫ్రెండు'అని పరిచయం చేస్తుందా? లేక 'మాకు తెలిసిన అతను' అని అంటుందా ? లేక తనకు తెలియ నట్టే ప్రవర్తిస్తుందా ? ఇతనెవరో నాకు తెలియదని అంటుందా ? అవును. అలా అన్నాఅనవచ్చు. నేను మాత్రం ఆ రోజు రాత్రి ఏమన్నాను.

''నేను నీకు అన్నయ్యను కాను. నిజమే. నీ మనసు నాకు తెలుసు. నా మనసు నీకు తెలుసు. కాని మన మనసులు వారికి తెలియవు. మన ఆలోచన వారికి విపరీతంగా ఉంటుంది. శశి నీ చెల్లెలు అని వారు ప్రతీ క్షణం గుర్తు చేస్తూంటే నేనీ ఆలోచనను ఎవరికి మాత్రం ఎలా చెప్పేది ? ఇంతవరకు మనం దూరంగానే ఉండిపోయాం. ఇప్పుడూ అలానే ఉండిపోదాం. నేను నీకు ఏమీ కాలేకపోయాను. నేను నీకేమీ కాను''—అని అనలేదూ ? అందుచేత ఇతనెవరో నాకు తెలియదు అని అనదూ ? అంటుందా ? నిజంగా అలా అంటుందా ?...అనదు. శశి ఎప్పుడూ అలా అనదు. తప్పని సరిగా నన్ను స్నేహితుడిగా నైనా స్వీకరిస్తుంది. శశి నన్ను చూచి ముఖం తిప్పుకుంటే నేనే అంటాను. ''మీ అందరి స్నేహితుడన''ని. చాలాకాలం తరువాత చూడగలుగుతున్నందుకు నా సంతోషాన్ని ఎలా వ్యక్తపరిచేది ? ప్రజంటేషన్ను తీసికెడితే ! అవును తీసికెడితే ! అవును. ఏం తీసికెళ్లాలి.

స్వీట్సు- అవును. స్వీట్సు తీసికెళ్తాను. శశికి ఇష్టమైన స్వీట్సు తీసికెళ్తాను . మరింకేమిటి ?

ఫ్రూట్సు – అవును. దొరికినన్ని రకాలు తీసికెళ్తా.

స్వీట్సు—ఫ్రూట్సు—మరి యింకా ఏం తీసికెళ్లాలీ. ఫ్లవర్స్— అవును చామంతి పువ్వులు శశికి చాలయిష్టం. కాని అతనేమను కుంటాడు. తప్పేమో. పోనీ వద్దు...పువ్వులు వద్దు.

'పిల్లలకి బట్టలు'—అవును ఈ సరికి శశికి కనీసం ఇద్ద రైనా పిల్లలుండి ఉంటారు. ఒక ఆడ, ఒక మగ ఇద్దరికి ఖరీ దైన డ్రసెస్ తీసికోవాలి.

శశికి ఖరీదైన చీర, ఇష్టమైన ఆకాశ రంగు చీర తీసి కెడితే...తీసికుంటుందా ? అసలు అతనేమనుకుంటాడు ? ఏమైనా అనుకోవచ్చు. పోనీ...వద్దు.

అయినా ఇన్ని తీసికెళ్లి యిస్తూంటే ''మేము వస్తున్నట్టు ఎలా తెలుసు''అని అడిగితే ఏమని చెప్పను ? అవును ? ఏం చెప్పాలి.

'లత వలన తెలిసింది' అని చెప్పనా ? వద్దు. అలా చెప్ప కూడదు.

'మరేమని చెప్పాలి ?' 'ఒక స్నేహితుడు కుటుంబంతో వెళ్తున్నట్టు ఉత్తరం వ్రాసాడు. అతన్ని చూద్దామని వచ్చాను. కాని అతను రాలేదు. ఇవన్నీ వాళ్ళకోసం తీసికున్నవే' అని అంటాను

'ఛీ! చాల అసహ్యంగా ఉంటుంది. చాల నీచంకూడ. ఒకరి కోసం తీసికెళ్లినవి మరి ఒకరికి యివ్వటం'.

'అయితే మరేమి చెప్పాలి ?'

'మీరందరూ ఈ ట్రైన్‌కి వస్తున్నట్టు కలవచ్చింది. కలలు నిజమవుతాయని నా నమ్మకం. నాకు వచ్చిన కలలు కూడ ఎప్పుడూ నిజమవుతాయి' అంటాను. నమ్ముతుందా ? నమ్మదు.

కాని, నాకెలా తెలిసిందంటారా ? నాకు కలవచ్చింది. ఆ కలలో మీరు పాసయినట్టు, ఆ మాట నాతో చెప్తున్నట్టు. నాకు వచ్చిన కలలు నిజమవుతాయి.

''నాకెప్పుడో తెలిసిపోయింది. మీరు ఇంటర్వ్యూకెళ్తారని. రెండురోజుల క్రితమే నాకు కలవచ్చింది...'' ఇలాగ తను చెప్పేసిన తరువాత ఇలా ఎన్నిసార్లు శశి తనకుముందే తెలుసని బుకా యించలేదు. నేనుకూడా అలానే బుకాయించేస్తాను. నమ్ముతుందా? నమ్మదు. గాని నవ్వేస్తుంది. పాతరోజులు గుర్తుకు తెచ్చుకుని నవ్వేస్తుంది.

సిగరెట్‌ను యాష్ట్రేలో వదలిపెట్టి నిలబడ్డాను. చాలా కాలానికి శశిని చూడగలుగుతున్నందుకు చాల ఆనందంగా ఉంది. ఆఫీసురూములో అడుగుపెడుతూ ''బజ్జర్'' నొక్కాను. రాఘవులు పరిగెత్తుకుని వచ్చాడు

'రామదాసు గార్నొకసారి పిలువు'.

రామదాసు పరిగెత్తుకుంటు వచ్చాడు.

'...ఇందాకటి ఫైలు రెడీ చెయ్యండి. ఆఫ్ ఏన్ అవర్‌లో పిలుస్తాను. ఈ లోపల నన్ను డిష్టర్బు చేయవద్దు' అంటూ అతన్ని పంపించేసి లత పూర్తి చేయవలసిన పని పూర్తి చేయ టానికి కూర్చున్నాను; టైపురైటర్ ముందు

శశి పదే పదే కళ్ళముందు కదులుతూవుంటే అనుకున్న టయిముకన్నా అరగంట ఆలస్యంగా ఇవతలికివచ్చాను ఆఫీసునుండి. రామదాసు సెలవు తీసికుని వెళ్ళిపోయాడు. అయిదున్నర కాకముందే చీకట్లు ముసురుకోసాగాయి. చలిగాలి రివ్వున వీస్తోంది .కాని ఆ చలిగాలి ప్రతీరోజులా నన్నేమీ చేయలేకపోతోంది.

నాయర్ చేసిన టిఫిన్‌కూడ ప్రతిరోజుకన్న చాల రుచిగా ఉంది. 'రాత్రికి కేంప్ ఉంది. సప్పర్ ప్రిపేర్ చెయ్యొద్దు' అని నాయర్‌కు చెప్పేసి, కారును రెడీ చెయ్యబోతున్న డ్రైవర్ ఖాసిమ్‌ను వారించి, బజారులోకి బయలుదేరాను. నేను స్టేషన్‌కి శశిని కలియటానికి వెళ్తున్నట్టు అతనికి కూడ తెలియటం నా కిష్టంలేదు.

ఆటోలో మార్కెట్టు అంతా తిరిగి స్వీట్సు, ఫ్రూట్సు, పిల్లలాడుకునే ఆటబొమ్మలు, అలా చాల రకాలు తీసికున్నాను. మూడు సంవత్సరాల తరువాత ఇదే మొదటిసారి ఆటోలో కూర్చోవటం. అదికూడ శశివలననే. శశి కోసమనే లత చేయవలసిన పనిని నేను చేసాను. శశికోసమే సామాన్య మానవుడిలా ప్లాట్‌ఫారంమీద వేచి ఉండవలసి వస్తోంది. ఇక ఆమె కోసమే సెకండుక్లాసు కంపార్టుమెంటులో ప్రయాణం చేయవలసి ఉన్నది.

రెడీమేడ్ క్లాత్స్ షాపులోకి అడుగుపెడుతూ వాచీ చూచుకున్నాను. ఎయిట్ ఫైవ్. రెండుజతల టెరీకాట్ డ్రెసెస్ పేక్ చేయించి, బిల్లు పే చేస్తూంటే అనిపించింది "ఇంత హంగామా చేస్తున్నాను. అసలు శశికి పెళ్ళయిందో లేదో !". "అవకపోతే ... అవును. అవకపోతే... నేనే ఎందుకు శశిని పెళ్ళి చేసుకోకూడదు?" ఛా! ఏమిటీ ఆలోచన! నేనిలాగ ఆలోచించవచ్చా?... తప్పేముంది ? నేను ఎందుకు శశిని పెళ్ళి చేసుకోకూడదు ?... చేసికోవచ్చు ... కాని...తను నన్ను అంగీకరిస్తుందా ? లేక 'ఆ రోజు రాత్రి నీవు నన్ను ఎంతగ బాధపెట్టావు ? నేను మరచిపోలేదు. నీ ముఖం నాకు చూపకు' అని అంటుందా?– అలా అన్నా అనవచ్చు. ఆల్ రైట్! ఏమి అన్నా భరించక తప్పదు. కాని ట్రైను కదులుతూంటే చెప్తాను 'నేను నీ కోసం వచ్చాను' అని. లత నీ పేరు చెప్పగానే ఎంతో ఆనందపడ్డాను. నీవు లత కలిసి విజయవాడలో తిరగటం నాకు తెలుసు. మన పరిచయం తరువాత నీవు లత గురించి చెప్పకపోయినా ఈరోజు నేను లత నీ ప్రాణస్నేహితురాలని గ్రహించాను. ఇంతకాలం నీ కోసం ఎంతో వెతికాను. నీవు విజయవాడలోకూడ లేవని తెలిసింది. అక్కడ మీ వాళ్ళుకూడ ఎవరూ లేరని తెలిసింది. ఇప్పుడు ఎవరున్నారని అక్కడికి వెళ్తున్నావు ? కాని నేను మాత్రం యిక్కడ నీకోసం ఉన్నాను నీవు అంగీకరిస్తే... కాని నేనిలా మాటాడవచ్చా ! తనకు పెళ్ళి కాలేదు కాబట్టి నా ఆలోచనలు ఇలా పోతున్నాయిగాని నేనిలా ఆలోచన చేయవచ్చా!..." ఇలా తర్జనబర్జన పడుతూ బిల్ పే జేసి ఒక ప్లాస్టిక్ బాస్కెట్‌నుకొని అందులో శశికోసం కొన్నవాటిని సర్దాను.

ప్రక్కనే ఉన్న కాఫీ హోటల్లోకి పరుగెత్తి రైల్వే ఎంక్వైరీకి ఫోన్ చేసాను. పదిహేను నిముషములలో ట్రైన్ వస్తున్నదని ఫోన్ వచ్చింది. పరుగెత్తే నడకతో కొద్దిదూరంనడిచి ఆటో అందుకున్నాను. ఆటోఫేర్ యిచ్చేసి స్టేషన్‌లో అడుగు పెడుతూంటే "నమస్తే! సార్!" అన్న రెండు గొంతుకలు వినిపించాయి.

తలత్రిప్పి ప్రక్కకు చూశాను. ప్రక్కనే లత, మూర్తి వాళ్ల చేతుల్లో చాల సరంజామా. "సార్!...సార్!...మీరూ..." మూర్తి అంటూంటే "అవును. నేను తుని వరకు వెళ్ళాలి. అర్జెంట్ పని" అన్నాను. వాళ్ళ దృష్టిలో పడినందుకు ఒకింత బాధ పడుతూ.

"కారుందిగా సార్?...మరి...మరి..."

"ఇవ్వాళ ట్రైనులో ప్రయాణం చేయాలని కోరికకలిగింది. ఐ హేవ్ గాట్ ఎ డిజైర్. ఓ.కే!" అన్నాను.

"ఓ. కే సార్. టిక్కట్ తెస్తాను" అంటూనే చెప్పేది వినిపించుకోకుండ టికెట్ కౌంటరువైపు పరుగెత్తాడు మూర్తి. అతను వచ్చేసరికి ట్రైన్ సైట్ అయింది. టికెట్ అతని దగ్గర తీసుకుని, పది రూపాయల నోటు అతని చేతిలోపెట్టి ప్లాట్‌ఫారం మీదికి పరుగెత్తాను. నా వెనుకనే పరుగెత్తుకుని వచ్చారు లత, మూర్తి.

ట్రైన్ వస్తున్న అలజడి వినిపించసాగింది.

లత, మూర్తి నాకు సమీపంలో నిల్చుని ఆత్రుతగా చూస్తున్నారు.

నా గుండె వేగాన్ని మించి స్పందించసాగింది. ఒళ్ళు ఒక్కసారి చమట పట్టింది. గొంతు తడారిపోయింది. రక్తనాళాలలో తిరుగుతున్న రక్తం ఒక్కసారి ఎక్కడి కక్కడ ఆగిపోయి ఒక్కసారి గుండెలోకి తన్నుకొచ్చినట్టు గుండెలో దడ. కళ్ళలో మంట. చేతులలో సన్నని ఒణుకు. ఒంటిమీద చమట ఆరిపోయేంత వేగంగా ఒంట్లోంచి వేడి. కళ్ళు మూతలు పడుతున్నట్టు – తల గిర్రున తిరుగుతున్నట్టు.

రొద చేసికుంటూ ట్రైన్ దూసుకుని వచ్చేసింది.

"అదిగో శశి". ఆనందంతో అరిచింది లత.

కణతలు నొక్కుకుంటూ, పెదములు తడిచేసికుంటూ అటు చూడప్రయత్నించాను. లత చూపించిన కంపార్టుమెంటు మమ్మల్ని దాటి వెళ్ళిపోయింది. నేను శశిని చూడటానికి వీలుపడలేదు, లత, మూర్తి అటువైపు కదలబోతూ–

"సార్ ! మీకు ఎకామెడేషన్......" అన్నారు.

"ఫరవాలేదు. దూర ప్రయాణం కాదుగా నే నెక్కడనైనా ఎడ్జస్టు అవుతాను. మీరు మీ స్నేహితురాలిని కలియండి" అన్నాను.

"మళ్ళా కలుస్తాం సార్ !" అంటూ కదిలేరు ఇద్దరూ పరుగెత్తే వేగంతో.

వాళ్ళు వెళ్ళినదారినే చూస్తూ నేనూ వారి ననుసరించాను శశిని చూడబోతున్నందుకు ఆనందం, అనుకోకుండ చాల కాలానికి ఆమె కంటపడ బోతున్నందుకు, అలాంటి అవకాశం వచ్చినందుకు ఆశ్చర్యం నాలో ముప్పిరి గొన్నాయి.

"శశీ ! నేను నీ కోసం, నిన్ను చూడటం కోసం వచ్చాను" పిచ్చిగా అరవాలనిపిస్తూంటే పరుగెత్తే నడకతో అటే వెళ్ళాను

లత పరుగెత్తుతూ స్లీపర్‌కోచివైపువెళ్ళి "హాయ్! శశీ!!" అంటూ కౌగలించుకుంది. లతను కౌగలించుకుని, లత భుజంమీద

తలపెట్టి ఆనందంగా నవ్వుతున్న ఆమెను చూశాను. గుండెలోకి రక్తం ఒక్కసారి దూసుకుపోయింది. గుండెలో కవాటాలు యధావిధిగా పనిచేయసాగాయి. కొండ ఎత్తున ఎగసిన ఉత్సాహమంతా నీరుగారిపోయింది. అయినా ఆశ. పరిశీలనగా ఆమెనే చూశాను. ఆ కళ్ళకోసం, ఆ కళ్ళలో మెరుపుల కోసం, గులాబీలు పూచే ఆ చెక్కిళ్ళ కోసం, కొనదేరిన ఆ చుబుకం కోసం మరీమరీ చూశాను. వెన్నెల మసకబారి పోయింది. చీకటి కళ్ళు తెరచుకుంది. నిరాశతో వెనుతిరిగి, కొద్ది దూరం నడిచి, ఇక నడవలేక, దగ్గరే ఉన్న సిమ్మెంటు బల్లమీద కూలబడ్డాను. లత, మూర్తి, ఆమె, నాకు కనిపిస్తునే ఉన్నారు. "శశీ!" దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచాను.

సిగరెట్‌ను వెలిగించి, పెదవులమధ్యకు తీసికోబోతూ మళ్ళా ఆశతో అటేచూశాను. ముగ్గురూ కంపార్టుమెంటులోకి నడిచారు. ఆమె శశిరేఖ కాదు.

నవ్వు...ఆ సిగరెట్ పొగల మధ్య శశి నవ్వు...నన్ను ఎగతాళీ పట్టించేటప్పుడు నవ్వేదే అట్లా!...ముఖానికి చేతులు అడ్డంగా పెట్టుకుని నవ్వే నవ్వు...చేతి వ్రేళ్ళ మధ్య నుండి దొంగ చూపులు చూస్తూ నవ్వే నవ్వు...పొడవైన మెడను వెనక్కి వంచి, గుండెలు ఎగసిపడగా నవ్వేదే అదే నవ్వు...నన్ను ఏప్రియల్ ఫూల్‌ని చేస్తూ నవ్విందే అదే నవ్వు...నా సిగరెట్ పాకెట్స్‌ను దాచేసి నన్ను బాధ పెడుతూ నవ్విందే అదే నవ్వు...వాటర్ కలర్సుతో కొబ్బరిచెట్ల మధ్య అందమైన పర్ణకుటీరాన్ని దిద్దుతూంటే, కుంచెతో గీతలు పెట్టేసి పారిపోతూ, జారిపోయే పయ్యెదను సవరించుకుంటూ నవ్విందే అదే నవ్వు...నన్ను ఏడిపించేనవ్వు; కవ్వించే నవ్వు, ఊరించే నవ్వు,...గలగలపారే సెలయేటి నవ్వు, ... ప్రతీసారి నేనానందించే. నవ్వు,...ఈరోజున నేను భరించలేని నవ్వు..."

"శశీ!" చెవుల చేతులతో మూసికుంటూ అరిచాను.

"బాబూ! పిలిచారా ?" అంటూ అటుపరుగెత్తే పోర్టరు, అదే పరుగుతో వచ్చి అడిగాడు. అతనివైపు అయోమయంగా చూస్తూ "లేదు" అన్నాను.

గొణుక్కుంటూ, తలపాగా సవరించుకుంటూ వెళ్ళిపోయాడు వాడు.

"సార్! మీరిక్కడున్నారా ? మీకోసం ప్లాట్‌ఫారం అంతా వెతుకుతున్నాను. రండి. టూ టైర్‌లో ఎకామిడేషన్ దొరుకుతుంది" అన్నాడు మూర్తి.

"సారీ! మూర్తీ!! నే నీ రోజు ప్రయాణంచేసే స్థితిలో లేను. ఆరోగ్యం బాగోలేదు. నేనింటికి వెళ్ళిపోవాలి. వెళ్ళిపోతాను" అంటూ లేచి నిల్చున్నాను.

మూర్తి నావైపు కంగారుగా చూస్తూ "పదండి సార్! అయితే," అంటూ బాస్కెట్ అందుకున్నాడు. బహుశా లతకోసం కొన్న ప్లాట్‌ఫారం టిక్కట్టువలన కాబోలు నన్ను గేటుదాటించాడు మూర్తి.

ఆటోలో కూర్చుంటూ "ఆ! మూర్తీ! అడగటం మరిచాను. మీరెవరికోసం వచ్చారో ఆమె వచ్చిందా ?" అడిగాను ఇంకా ఏదో సంశయం పీడిస్తూండగా.

"వచ్చింది సార్! శశికళ అనే ఈమె లతతో కలిసి ఆరు నెలలు ఇక్కడే సేల్సుగర్ల్‌గా పని చేసింది సార్. తక్కువకాలమైనా వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితురాండ్రైనారు. అసలు ఇద్దరూ విజయవాడలో ఒక సంవత్సరం కలిసి చదువుకున్నారు కూడా!" అన్నాడు.

"ఐసీ!" అన్నాను మరేమనాలో తెలియక.

"టిక్కట్ ఇవ్వండి సార్! రిఫండ్ తీసికుందాం" అన్నాడు.

చేతిలోచూశాను. లేదు. "ఎక్కడోపడిపోయింది మూర్తీ!" అన్నాను.

"బయలుదేరుదామా సార్!" తొందర చేసాడు ఆటో డ్రైవర్!

"వన్ మినిట్" అని మూర్తినిచూసి "మూర్తీ! ప్లీజ్! ఈ బాస్కెట్ తీసికో. ఇందులోవి మీ పిల్లలకి యియ్యి" అన్నాను బాస్కెట్ అతనికి అందిస్తూ.

"అదేమిటిసార్! వద్దుసార్!! మీరెవరికోసం కొన్నారో వారికే ఇవ్వండిసార్! రేపైనా వెళ్తారు కదండిసార్, ఎందుకుసార్! ఉంచండిసార్!"

"నే వెళ్ళే అవసరంలేదు మూర్తీ, నే నిక స్టేషన్‌కివచ్చే అవసరం కూడ రాదు. తీసికో. ఆ! డ్రైవర్! వెళ్దామా?" అన్నాను.

ఆటో కదిలింది. మూర్తి "గుడ్‌నైట్" అంటూంటే శశి నవ్వులమధ్య ఆటో కదిలింది. ఆ రోజు రాత్రి గుండెమీద తలపెట్టి ఏడుస్తూ, పిచ్చిగా నవ్విందే ఆ నవ్వులమధ్య ఆటో కదిలిపోయింది" అంటూ కాగితాలు మడిచాడు రఘురాం. నేను కళ్ళెత్తి కళ్ళజోడును సవరించుకున్నాను.

"కథ ఎలా ఉంది గురువుగారూ!" అన్నాడు రఘురావ్.

"చాల బాగుంది. 'నాకూ అలాంటి శశి ఉంటే బాగుండునేమో"! అనిపిస్తోంది అన్నాను. సిగ్గుపడుతూ ఒక నవ్వు నవ్వాడు రఘురావ్. తరువాత కథ గురించి అయిదునిముషాలు మాటాడి వెళ్ళిపోయాడు.

ఇంట్లోకి వస్తూంటే వంటింటి గుమ్మం ముందు నిలబడి నన్నుచూచి మూతి మూడు వంకలు తిప్పింది మా శ్రీమతి.

"ఆ మూతి కేమయిందట," దగ్గర కెడుతూ అడిగాను.

"నా మూతికేంకాలే, అయినా మాత్రం ఏంలెండి. తొందరగా భోజనం చేసి మీ శశిని వెతుక్కోటానికి వెళ్తారా?" అంది. నా కర్త

(మిగతా 70 వ పేజీలో)

ఇదే సంచికలో మరోవ్యాసంలో తన గతతర్కిక భౌతికవాదం యింకా అలానే వుందని వ్రాసుకొన్నారు. 'మంచి గతమున కొంచెమే నోయ్' అంటూ కవి వాక్కును స్పృశించారు. అలాగని గతాన్ని తలుచుకొనడానికే భయపడిపోతే ఎలా?

ఇకపోతే వీరి ఆరోపణ విప్లవ రచయితల సంఘం ఎన్నో ముక్కలైందని. వి.ర.సం లోనుండి కొందరు రచయితలు నిష్క్రమించారే కానీ, మరో వి. ర. సం. స్థాపన యింతవరకూ జరగలేదు. కానీ అభ్యుదయ రచయితల సంఘం యిప్పటికే రెండు ముక్కలైంది. ఒకనాడు అరసంలో అగ్రగామిగావున్న ఈ విమర్శకులు ఈనాడు ఏ రసంలో వున్నట్టు? మద్రాసు రసంలోనా? విశాలాంధ్రరసంలోనా? గాజు గృహంలో కూర్చొని యితర్లపై రాళ్లు రువ్వడం శ్రేయస్కరం కాదని మనవి చేస్తున్నా.

'గాలి కదిలితే మళ్ళీ కనిపించని కరపత్రాలకు వీరు పుస్తక రూపం కల్పించారు'—వారం తిరిగేసరికి మిఠాయి కొట్లల్లో కనిపించే పత్రికల్లో ఎప్పుడెప్పుడో ప్రచురించిన తమ కవితలను పుస్తక రూపంలో 'అనల కిరీటం'గా ప్రచురించడంలో శ్రీ సోమసుందర్ గారు సాధించిన ప్రయోజనమేమిటి?

కమ్యూనిస్టుపార్టీ చీలి, ముక్కచెక్కలైందని చెబుతూ వీరు ఉన్నంతలో సి. పి. ఐ. నయమంటూ ఓ కితాబు యిచ్చారు.

దేశంలో ఫ్యూడల్ వ్యవస్థను చిరంజీవిగా నిలపడంకోసం పాటుబడుతున్న అభివృద్ధి నిరోధక కాంగ్రెస్ పాలకులను సమర్థించింది సి.పి.ఐ. దేశంలో నిరంకుశపాలన, ఏకవ్యక్తి నియంతృత్వాన్ని అమలు జరిపి అనేక వందల వేల కుటుంబాలు నాశనం కావడానికి కారణమైన ఇందిరాగాంధీ పరిపాలనను పొగడుతూ, వారికి అండగా నిలిచిన సి.పి.ఐ.ని వీరు మెచ్చుకుంటున్నారు. పౌరస్వేచ్ఛను, పత్రికా స్వాతంత్ర్యాన్ని కాలరాచి, దేశాన్ని 20 నెలలపాటు చీకటిలో ముంచిన ఎమర్జన్సీని సమర్థించారు సి. పి. ఐ. వారు. అనేక వేల అమాయక ప్రజల రక్తంతో తడిసిన కాంగ్రెస్‌వారి చేతులతో కరచాలనం చేస్తున్న సి. పి. ఐ. వారు ఈ విమర్శకులకు ఉత్తమ రాజకీయ వేత్తలుగా, సిసలైన కమ్యూనిస్టులుగా కనిపిస్తున్నారు. ఈనాడు దేశం మొత్తాన్ని కలిచివేసిన రాజన్ హత్యలాంటి అనేకానేక హత్యలకు కారకులైన కాంగ్రెస్‌తో కేరళలో నేటికీ పొత్తు పెట్టుకున్న సి.పి.ఐ. అత్యవసర పరిస్థితికాలంలో జరిగిన ఘోరాలకు బోనెక్కాల్సిన రెండవ ముద్దాయి అనడం అతిశయోక్తి కాదు.

గ్రంథవిమర్శలు ఎప్పటికీ సద్విమర్శలుగా వుండాలి. వ్యక్తిగత అభిప్రాయాలను చొప్పించి దాన్ని తమ అక్కసును వెళ్ళగక్కే వ్యాసంగా తయారుచేయడం అంత మంచిదికాదు.

శ్రీ ఎం వేణుగోపాల్

"శ శి"

(60 వ పేజీ తరువాయి)

మైంది. నేనేదో అనేలోగా తానే అంది. "అయినా అవేం కథలండీ అతగాడు రాయటానికి మీరు చదవటానికీ సరిపోయింది."

"కథకేమయిందట" అన్నాను.

"అంత పిచ్చివాడు ఎక్కడైన ఉంటాడా? ఆ శశి ఎవరో, అసలు పేరేమిటో, ఏమీ తెలిసికోకుండ అలావెళ్లిపోతాడా?" అంది చేతులు తిప్పుతూ.

"అలాగా! నీకు గుర్తుందా? మన బుజ్జిగాడు నీ ప్రక్కనే పడుకుని పాలుతాగుతూంటే, మాగన్ను పెట్టి నిద్రపోయే నీవు, ప్రక్కంటి వాళ్ళ పసివాడేడిస్తే తుళుక్కుపడి, లేచి, బుజ్జిగాడిని ఒకసారి చూచుకుని మళ్లా సర్దుకునే దానివి కాదూ."

"అయితే! అదీయిదీ ఒకటే!"

"అక్షరాలా. ఏ పసిపాప ఏడ్చినా తన పిల్లే ఏడ్చినటు ప్రతీ తల్లి అనుకుంటుంది. ...ముందీ ప్రశ్నకు జవాబు చెప్పు. సీత ఎవరు?"

"ఇంకెవరు రాముడి భార్య."

"అదేం. రాముడిభార్యే సీత ఎందుకు కావాలి? మీ చెల్లెలు కూతురు కాకూడదా? మీ అప్పడాల అత్తగారి పెద్ద కోడలు కాకూడదా? మా శేషగిరి భార్య కాకూడదా? కావచ్చు. కాని లోకానికంతటికీ ఒకే సీత. నిజమైన ప్రేమికుడికి ఒకే శశి. పద ముందు అన్నం వడ్డించు" అంటూ కళ్ళజోడు టేబిల్‌మీద పెట్టాను.

బావిదగ్గర కాళ్ళు కడుక్కుంటూంటే మా శ్రీమతి సన్నగా అంటోంది.

"ఈ కథలగాలి ఈయనకీ సోకింది" అని